ఓటింగ్‌పై అవగాహన



ఓటింగ్‌పై అవగాహన ర్యాలీలో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గురువారం ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభించి మైసమ్మగూడలో పలు వీధుల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో అసం రాజేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై ఫిర్యాదు

మేడ్చల్: ఎలాంటి ఆధారాలు లేకుండా మండలంలోని డబీల్‌పూర్ గ్రామానికి చెందిన 332 మంది పేర్లను అధికారులు ఓటర్ల జాబితా నుంచి తొలగించారని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భవానీ వెంకటేష్, షేక్ సలాం అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 10, 11, 12, 13 బూత్‌లలో 332 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని కీసర ఆర్డీఓ, మేడ్చల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేసి ఓటు హక్కు కల్పించాలని కోరారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

శామీర్‌పేట్: ద్విచక్ర వాహనాన్ని ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రవి(26)తో పాటు మరో ఇద్దరు గణేష్, సగాయ్ పల్సర్ బైక్‌పై లాల్‌గడి మలక్‌పేట నుంచి వెళ్తుండగా విమల ఫీడ్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీ కొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలోకి భారీ చేరికలు



బీజేపీలో చేరిన శ్రీరంగవరం వాసులతో ఈటల రాజేందర్

మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. గ్రామానికి వివిధ పార్టీల నాయకులు, యువకులు, విశ్రాంత ఉద్యోగులు, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగులు బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఈటల రాజేందర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పోచయ్య, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల గెలుపు కోసం కృషి చేయాలి



సమావేశంలో ఈటల రాజేందర్ కోడలు క్షమిత, నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలని ఈటల రాజేందర్ కోడలు క్షమిత అన్నారు. నాగారం మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ ఇంటింటి ప్రచారం



మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులు, గ్రామాల్లో బీజేపీ నాయకులు జోరుగా ప్రచారం సాగించారు. ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని కోరుతూ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..



ఘట్‌కేసర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

ఘట్‌కేసర్: కేంద్రంలో, మల్కాజ్‌గిరిలో బీజేపీనే గెలుస్తుందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్‌లో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు పాదయాత్ర చేపట్టారు. బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రామ తీర్థ, రవిశంకర్, శశికాంత్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, లక్ష్మారెడ్డి, సుభాషిణీ, పవన్, నరేశ్‌ముదిరాజ్, రాష్ట్ర, జిల్లా మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15.36 లీటర్ల మద్యం సీజ్

శామీర్‌పేట్: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం శామీర్‌పేట పోలీసులు సీజ్ చేశారు. వివరాలు.. తూంకుంట మున్సిపాలిటీ మందాయిపల్లి చౌరస్తా వద్ద శామీర్‌పేట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో 15.36 లీటర్ల మద్యం బాటిళ్లను ఇద్దరు వ్యక్తులు తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు మద్యాన్ని సీజ్ చేసి, వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్ లక్ష్యంగా..

వ్యూహం



- ప్రచారం పూర్తికానుండటంతో పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి
- అన్ని వర్గాల మద్దతు కోసం పార్టీ నేతల ప్రత్యేక కసరత్తు
- ఓటర్ల కోసం లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థుల వేట



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల ప్రచారం ముగిసేందుకు గడువు సమీపించటంతో నగరంతో సహా శివారు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని ప్రధాన పార్టీల అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్లను విభాగాలుగా విభజిస్తున్నారు. ఇందులో అనుకూలురు, తటస్థులు, స్థానికంగా ఓటు కలిగి ఇతర చోట్ల నివసిస్తున్నవారు, ఇతర పార్టీల మద్దతుదారులుగా ఓటర్లను విభజిస్తున్నారు. పోల్ మేనేజ్‌మెంట్ లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. తమకు పక్కాగా ఓటేసేవారు, తటస్థులు, ఇతర పార్టీల మద్దతుదారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.


- నగరంతో సహా శివారు హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చెవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూనే.. రాత్రి వేళల్లో ప్రధాన అనుచరులు, ముఖ్య నాయకులు తమ వైపే ఉన్నారా లేదానని సమీక్షించుకుంటున్నారు. ప్రత్యర్థుల తాయిలాల వలకు చిక్కకుండా అప్రమత్తమవుతున్నారు. పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ పెరుగుతోంది. తమ అనుకూలమైన పరిస్థితులు ఏమిటనే విషయంపైనే చర్చించేందుకు సమయం సరి పోతుందని ఆందోళన చెందుతున్నారు.
- ఓటర్లకు దగ్గరయ్యేందుకు ఆత్మీయ సమ్మేళనాలు, పలకరింపుల కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు.

వయస్సు, సామాజిక వర్గాల వారిగా ఓటర్లను విభజించి వారిని ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు. పోలింగ్ ముగిసే వరకూ తమవైపు అనుకూల పవనాలు వీచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఓటర్లను ఆకర్షించడంతో పాటు ప్రత్యర్థి శిబిరం నుంచి ముప్పు తప్పించుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలతో ముందడుగు వేస్తున్నారు. ఎన్నికల ప్రచారం ఎంత చేసినా, ప్రలోభపెట్టినా పోలింగ్ కేంద్రం వరకు ఓటరును తీసుకొచ్చే బాధ్యతలను ద్వితీయశ్రేణి నాయకులకు అప్పగిస్తుంటారు. ఓటేసే వరకు ఓటర్లను పలకరించేలా తమ అనుచరులను జాగ్రత్త పరుస్తుంటారు. దూరభారంతో ఇబ్బంది పడే ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా ప్రత్యేకంగా వాహనాలను కూడా సమకూర్చుతుంటారు.

ప్రసన్నం చేసుకునేలా..

వైద్యులు, మెడికల్, అసోసియేషన్లు, వాహనాల డ్రైవర్లు, చేతి వృత్తిదారులు, కుల వృత్తిదారులు, అసంఘటిత రంగ కార్మికులు, రైతులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, ఐటీ ఉద్యోగులను ప్రసన్నం చేసుకునేలా కీలక నాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. వివిధ సామాజికవర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోరుకున్న వారికి ప్రత్యేక పార్టీలు తాయిలాలు ఇస్తూ పోలింగ్ నాటికి అంతా చక్కబెట్టుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

- నగరంతో సహా శివారు పరిధిలోని 4 పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. ఇందులో దాదాపు అన్నిచోట్లా ఇంచుమించు ఇదే వైఖరిని ప్రధాన పార్టీల అభ్యర్థులు అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. అనుకూల ఓటర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే తటస్థులు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని తమవైపు తిప్పుకొనేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఇతర పార్టీల మద్దతుదారుల కదలికలపైన కూడా నిఘా పెడుతున్నారు. అనుకూల ఓటర్లకు ఏమాత్రం మర్యాద తగ్గకుండా చూస్తున్నారు.



కాలనీలు, డివిజన్/వార్డు, మండలం, బస్తీ, గ్రామస్థాయిలో ప్రాబల్యం చూపేవారి కోరికలను వెంటనే తీరుస్తున్నారు. ఏమి ఆశిస్తున్నారో తెలుసుకుని ఆకర్షించేందుకు ఎంత ఖర్చుకైనా వెనకాడొద్దని ప్రధాన అనుచరులకు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ఇతర పార్టీల మద్దతుదారులు రోజువారీగా ఎక్కడ తిరుగుతున్నారు. ఎవరెవరితో మాట్లాడుతున్నారు? అనే విషయాలపై కూడా తెలుసుకుంటున్నారు. వారిని తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

సంస్కృతిలో జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం



రావల్‌కోల్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు, కౌన్సిలర్ బిజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. కారు గుర్తుకే ఓటు వేసి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రచారం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి నమూనా బ్యాలెట్ పేపర్లను అందజేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు దాసరి శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అత్వెల్లిలో బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రావల్‌కోల్‌లో బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం

మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్, మునీరాబాద్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు తమ అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. రావల్‌కోల్ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, వైస్ ఎంపీపీ వెంకటేశ్, మాజీ సర్పంచులు మహేందర్, రాజమల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, యూత్ అధ్యక్షుడు హరత్‌రెడ్డి, నాయకులు సత్తిరెడ్డి, నిషితారెడ్డి, వెంకటేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సంస్కృతి టౌన్‌షిప్‌లో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు

మేడ్చల్‌లో బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని వివిధ వార్డుల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు వివిధ వార్డుల్లో పర్యటించి ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డికి ఓటు వేయాలని కోరారు. పట్టణ పరిధిలోని కిందిబస్తీ, ఎన్‌జీఓ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ గిర్మాపూర్, అత్వెల్లి, కిష్టాపూర్‌లలో కర పత్రాలను ఇంటింటికీ అందజేశారు. బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు విష్ణచారి, రవికుమార్, సందీప్‌గౌడ్, ఉమానాగరాజు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



వజ్రేష్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు కొడే మహేష్, జంగా హరికృష్ణ యాదవ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ నాయకులు, కౌన్సిలర్లు మల్లేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, శ్రవణ్‌కుమార్‌గుప్తా, మధుకర్‌యాదవ్, చాప రాజు, దేవ, నరేందర్, సాయి కుమార్, నర్సింహస్వామి యాదవ్, వైస్ చైర్మన్ రమేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వజ్రేశ్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, పావనీయాదవ్

కీసర: కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని కీసర మండల ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. చీర్యాల గ్రామంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, తటాకం వెంకటేష్, బలిదే రమేష్‌గుప్తా, మాచ్చాని జంగయ్య యాదవ్, దయానంద్‌గౌడ్, రాయిల శ్రావన్ కుమార్‌గుప్తా, రామిడి స్వప్న, తటాకం అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



కీసరలో కాంగ్రెస్ నేతల ప్రచారం



జ్ఞానాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మహిళా నాయకులు



చీర్యాల గ్రామంలో కాంగ్రెస్ నేతల ప్రచారం



ఉద్దమర్రిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మేడ్చల్ రాఘవేంద్రనగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు కొత్తకొండ వెంకటేశ్‌తో పాటు పలువురు నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. బీబ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, బీ బ్లాక్ జాయినింగ్ కమిటీ సభ్యుడు యాదగిరియాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలయాదవ్, రాధాకృష్ణముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటి ప్రచారం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని కండ్లకోయ, బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, మరిళ పాల్గొన్నారు.

ఉద్దమర్రి గ్రామంలో..

శామీర్‌పేట్: ఉద్దమర్రి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం ప్రచారం నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు తునికి వెంకటేష్, నాయకులు విష్ణుగౌడ్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలనర్సింహ, లక్ష్మణ్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వివిధ పార్టీల నాయకులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి మూడవ వార్డుకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు కౌన్సిలర్ దేవ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. తోటకూర వజ్రేష్‌యాదవ్ కండువాలు కప్పారు. మూడో వార్డుకు చెందిన అధిక మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అత్వెల్లి కాంగ్రెస్ నాయకులు దేవ, శ్రవణ్‌కుమార్,మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

మేడ్చల్: అత్వెల్లి, గిర్మాపూర్, కిష్టాపూర్‌లలో, డబీల్‌పూర్, గౌడవెల్లి తదితర గ్రామాల్లో నాయకులు ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్లు దేవ, మధుకర్‌యాదవ్, మానస శ్రవణ్‌కుమార్ గుప్తా, చాపరాజు, భవాని రాఘవేందర్‌గౌడ్, నాయకులు వెంకటేష్ యాదవ్, విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే ఘట్‌కేసర్ అభివృద్ధి



ఘట్‌కేసర్: బీఆర్‌ఎస్ పాలనలోనే ఘట్‌కేసర్ అభివృద్ధి చెందిందని, రైల్వే వంతెన పనులు ప్రారంభించామని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారపల్లి నుంచి ఎదులాబాద్ వరకు డబుల్ లైన్ రోడ్డు, కొండాపూర్‌లో బాలికల ఐటీఐ భవనం నిర్మిస్తున్నామన్నారు. మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, అనురాధ, రమాదేవి, వెంకట్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పయనమెటో..?

- రాజీనామా బాటలో బీఆర్‌ఎస్ మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్
- మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో మంతనాలు
- చైర్ పర్సన్ చేరికను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు
- పార్టీ మార్పుపై తానేమీ చెప్పలేనని చైర్మన్ స్పష్టీకరణ



మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో చైర్ పర్సన్ దీపిక భర్త నర్సింహారెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్: కాలం కలిసి రాకపోతే ఓడలు బండ్లు.. బండ్లు ఓడలవుతాయని తరచూ వినబడే మాటలు మేడ్చల్ రాజకీయంలో కనబడుతున్నాయి. ఎందరూ వ్యతిరేకించినా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తన కుడిభుజం అంటూ మేడ్చల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మర్రి నర్సింహారెడ్డి భార్య దీపికారెడ్డిని గత మున్సిపల్ ఎన్నికల్లో చైర్ పర్సన్‌గా ఎంపిక చేసుకున్నాడు. అలాంటి నాయకుడు తనకు అన్నీ ఇచ్చిన బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పే యోచనలో కనిపిస్తున్నాడు. మారిన రాజకీయంతో అధికార పార్టీ వేధింపులో, రాజకీయ ఒత్తిళ్లో కారణం ఏదైనా.. మేడ్చల్ పట్టణంలో బీఆర్‌ఎస్‌కు పెద్ద దిక్కుగా ఉన్న నర్సింహారెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో మంతనాలు..

మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్‌లో ఉన్న 11 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరారు. తాము చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెడతామని కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు ప్రకటించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి అంటే పిచ్చి అభిమానం ఉన్న చైర్ పర్సన్ భర్త మల్లారెడ్డి మేడ్చల్‌లో మల్లారెడ్డికి కుడిభుజంగా వెలుగొందుతున్నాడు. కాంగ్రెస్‌లో చేరకపోతే పదవి పోతుందనే కారణంతో ఆయన పార్టీ మారేందుకు మార్గాలు వెతుకుతున్నాడు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంగళవారం రాత్రి నర్సింహారెడ్డి, ఆయన సోదరుడు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డిలను తన ఇంటికి పిలిపించుకుని మంతనాలు జరిపారు. నర్సింహారెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసిన ఫొటోలు స్థానికంగా వైరల్ అవుతున్నాయి. తన పదవికి ఎలాంటి డోకా ఉండదని హామీ ఇస్తే తాను, తన అనుచరులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమని నర్సింహారెడ్డి హామీ ఇచ్చారని సమాచారం.

కౌన్సిలర్‌కు మొదటి నుంచీ..

మేడ్చల్ కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి మున్సిపాలిటీలో ఉన్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, చైర్ పర్సన్‌కు పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. చైర్ పర్సన్ ఎన్నిక సమయంలో దీపికారెడ్డి అభ్యర్థిత్వాన్ని మెజారిటీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు వ్యతిరేకించారు. నాడు ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డిలు పవర్‌ఫుల్‌గా ఉండటంతో కౌన్సిలర్లు దీపికకు మద్దతు ప్రకటించారు. ఆ తర్వాత మున్నాళ్లకే తిరుగుబావుట ఎగురవేశారు. చైర్ పర్సన్‌ను గద్దె దించాలని ఏకంగా రోడ్లపైనే ధర్నాలు చేశారు. బీఆర్‌ఎస్‌లోనే ఉంటూ అవిశ్వాసం నోటీసు కలెక్టర్‌కు అందజేశారు. దీంతో కౌన్సిలర్లను చైర్‌పర్సన్ భర్త బ్యాంకాక్, గోవా ట్రిప్పులకు తీసుకెళ్లి శాంతింపజేశారు. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గుంపుగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో చైర్‌పర్సన్‌కు ఒత్తిడి అధికమైంది. దిక్కుతోచని పరిస్థితిలో ఆయన తన పదవులు, ఆస్తులను కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లో చేరుతున్నారనే చర్చలు జోరుగా మేడ్చల్‌లో సాగుతున్నాయి.

వేధింపులే కారణమా..?

మర్రి నర్సింహారెడ్డి ఇటీవల మేడ్చల్ మున్సిపల్ పరిధిలో ఉన్న భూములు అమ్మడంతో వచ్చిన సొమ్ముతో ఆయన ఏకంగా నాలుగు భవనాలను నిర్మిస్తున్నాడు. భవనాలు అనుమతుల ప్రకారం లేవని చర్యలు తీసుకోవాలని అధికార పార్టీ నాయకులు ఫిర్యాదులు చేయడం వాటి ఆధారంగా విచారణ ప్రారంభమైంది. బీఆర్‌ఎస్‌లో ఉంటే తన ఆస్తుల జోలికి వస్తున్నారని తాను సైతం పార్టీ జంప్ చేయాలనే దోరణిలో చైర్ పర్సన్ కుటుంబం కనిపిస్తోంది.



చైర్ పర్సన్ చేరికను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

పార్టీకి చెడ్డపేరు వస్తోందని..

కాంగ్రెస్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక చేరికను గత ఎన్నికల్లో కాంగ్రెస్ బీఫారంపై గెలిచిన కౌన్సిలర్లు రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, చాప రాజు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చైర్‌పర్సన్ కాంగ్రెస్‌లో చేరడం కోసం తమ పార్టీ నాయకుల వద్ద ప్రయత్నాలు చేస్తున్నారని, అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అవినీతి వల్ల తమ పార్టీకి చెడ్డ పేరు వస్తోందని అంటున్నారు.

ఏమీ చెప్పలేను: నర్సింహారెడ్డి

కాంగ్రెస్‌లో చేరాలని మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆహ్వానించిన మాట వాస్తవమని, ఈ విషయంపై ఏమీ చెప్పలేనని ఆయన తెలిపారు. తనపై ఎలాంటి ఒత్తిళ్లు లేవని మేడ్చల్ అభివృద్ధి కోసం నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.